'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ
మాటే కొండంత బలం

బీఆర్ఎస్ పార్టీ లేకపోతే బాగుండని కాంగ్రెస్, బీజేపీ బలంగా కోరుకుంటాయి. అందుకే ఆ పార్టీ పని అయిపోయిందని పదేపదే వల్లిస్తుంటాయి. ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టే పార్టీలవి. గల్లీ మనసు వాటికి ఎంతచెప్పినా అర్థం కాదు. కానీ, బీఆర్ఎస్ అలా కాదు. ఇక్కడి జనం గుండె చప్పుడుతో లయ కలిపిన పార్టీ. ఆ పార్టీ అధినేత కేసీఆర్ స్వరాష్ట్ర సాధన పోరుకేక. బంగారు తెలంగాణ కోసం సాగిన ఏరువాక. ఏదో ఏమరుపాటున ఓటును చేజార్చుకుని, 'ఎంతపనాయే' అని మథనపడుతున్న తెలంగాణ బిడ్డలకు దిక్కుతోచడం లేదు. అందుకే టీవీలకు అతుక్కుపోయారు. ఓ మీడియా చానల్‌కు కేసీఆర్ ఇచ్చిన ఇంటర్వ్యూను టీ-20 క్రికెట్ మ్యాచ్ లైవ్ చూసినట్టు 4 గంటల పాటు ఉత్కంఠభరితంగా చూశారు. టీవీ తెరమీద కేసీఆర్ లెక్కాపత్రం చెప్తుంటే కండ్లప్పగించారు. తెలంగాణ సాధకుడి మాటలతో వారికి గుండె భారం దిగింది. భవిష్యత్తుపై భరోసా కలిగింది. కేసీఆర్ ఇచ్చిన ఆ టీవీ ఇంటర్వ్యూ వెయ్యి ఎన్నికల సభల పెట్టు అని చెప్పాలి. ఇంటింటా కేసీఆర్ గొంతు మారుమోగింది. ప్రతిఒక్కరికీ ఓ పెద్దదిక్కు పక్కన కూసుండి 'నేనున్న తియ్యి బిడ్డా నీకేమైతది' అని భుజం తట్టినట్టు అయ్యింది. దటీజ్ కేసీఆర్.

అపజయాల్నే సోపానాలుగా మలచుకుని అంచెలంచెలుగా ఎదిగి ఢిల్లీ కోటను ముట్టడించిన సాహసి కదా.. తెలంగాణకు మహోజ్వల శకాన్ని సాధించిన ప్రగతి పిపాసి కదా.. ఇప్పుడేదో చిన్న విరామం వస్తే ప్రత్యర్థులు రెచ్చిపోయి అత్యాశతో బీఆర్ఎస్ కథ ఒడిసిపోయిందని వెర్రికూతలు కూస్తున్నారు. కానీ, కేసీఆర్ వారికి దీటైన సమాధానమిచ్చారు. ఓటమికి భయపడి కాడిపడేసే బాపతు కాదు కేసీఆర్. అట్లయితే తెలంగాణ వచ్చునా, సమున్నతంగా నిలుచునా? అందుకే బంగారు తెలంగాణ సంపూర్ణంగా సాకారం అయ్యేంత వరకు నా పోరాటం ఆగదు అని ధీమాగా చెప్పారు. మాటల్లో పెట్టి ఓటును మాయ చేసే కేటుగాళ్ల వలలో చిక్కి విలవిలలాడుతున్న తెలంగాణకు కేసీఆర్ మాట ఓ ఊరట. తెలంగాణ చరిత్రతో పెనవేసుకున్న దార్శనిక నాయకత్వం తనది. ఆ చరిత్రను పలకపై బలపం రాతల్లా చెరిపేయాలనుకుంటే ఎలా కుదురుతుంది? తన ఆనవాళ్లు లేకుండా చేయాలంటే తెలంగాణను చెరిపేయాల్సిందేనని కుండబద్దలు కొట్టారు కేసీఆర్. ఆయన ప్రజాసేవ అనే బ్యాడ్జీ తగిలించుకున్న సాదాసీదా రాజకీయ నేత కాదు. తెలంగాణను అణువణువూ నింపుకొన్న స్వాప్నికుడు. అందుకే ఆగమైపోయిన బతుకుల్ని చీకట్లోంచి బయటపడేసే దారిదీపమూ తానే అవుతానని తేల్చిచెప్పారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉతికి ఆరేశారు. వారి చేతగానితనాన్ని ఎండగట్టారు. ప్రజలకు ఎవరు ఏమిటో తెలిసిపోతున్న తరుణంలో కాంగ్రెస్ నేతల గుండెల్లో కేసీఆర్ మాటలు శతఘ్నుల్లై పేలుతున్నాయి.

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల హోరులో కొందరు నేతలు మాటలు జారుతున్నారు. అలాంటి మరుగుజ్జు నేతలకు హుందాతనంలో పాఠాలు చెప్పారు కేసీఆర్. ఇంకా మారకపోతే ప్రజాక్షేత్రంలో గుణపాఠాలు తప్పవని మందలించారు. ప్రజలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలకు కర్తవ్యబోధ చేశారు. ప్రజలు రికార్డు స్థాయిలో పెద్దసంఖ్యలో వీక్షించారని నివేదికలు వస్తున్న కేసీఆర్ టీవీ ఇంటర్వ్యూ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిందనే విశ్లేషణలూ వినవస్తున్నాయి. నైరాశ్యాన్ని వదిలించి ఉత్సాహోద్వేగాలు నింపి ముందుకు నడిపించడమే కదా నాయకుడి లక్షణం. అది ఆయనకు వెన్నతో పెట్టిన విద్య!

రెఫరెండం పాలనకా? వైఫల్యాలకా?

డాక్టర్ బీఎన్ రావు

> లోక్‌సభ ఎన్నికలను తమ పాలనకు, పనితీరుకు రెఫరెండంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొనడం విస్తృత చర్చకు దారితీస్తోంది. ఎన్నికల షెడ్యూలు నాటికి మూడున్నర నెలల పాలనను చూసి ఓటేయాలని రేవంత్ కోరడం అందరినీ విస్మయానికి గురి చేసింది. పాలన ఆరంభ దశలోనే ఉండగా.. మైండ్‌గేమ్‌తో విపక్షాలను దెబ్బతీయాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో విభిన్న ఫలితాలు ఉంటాయనే అంచనాలున్నాయి. ప్రజాతీర్పు దానికి ప్రామాణికం కానున్నది.

గతేడాది డిసెంబరు ఏడో తేదీన తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్.. వాటిలో ఒక్క మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప ఏ గ్యారెంటీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది. రైతు రుణమాఫీ చేయనేలేదు. రైతుబంధు స్థానంలో తెస్తామన్న రైతు భరోసా ఊసేలేదు. రైతుబంధు కింద పెట్టుబడి సాయం కూడా మూడెకరాల వరకే అందించినట్టు తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ పథకానికి రూ.10 లక్షల చికిత్స పరిమితిని బీఆర్ఎస్ ప్రభుత్వమే వారి హయాంలో పెంచినందున అది కాంగ్రెస్‌కు అంతగా లాభించలేదు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుకు కోటి మంది దరఖాస్తు చేసుకుంటే 40 లక్షల మందికి మాత్రమే వర్తింపజేయడంతో మిగిలినవారు అసంతృప్తితో ఉన్నారు. రూ.500 సిలిండర్ పథకం ప్రారంభమే కాలేదు. రాష్ట్రంలో గత పదేండ్లుగా కరెంటు, సాగు, తాగునీటి సమస్యలు లేవనేది నిర్వివాదాంశం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంటు కోతలు ఉంటున్నాయనేది నిజం. తాగునీటి సరఫరాలో ఆటంకాలున్నాయి. సాగునీటి వ్యథ నెలకొంది. మేడిగడ్డ బరాజ్‌లోని మూడు పిల్లర్లు కుంగితే మొత్తం రిజర్వాయరే కుంగిపోయిందని చెప్పి.. కాళేశ్వరం నీళ్లను వినియోగించకపోవడంతో సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది. ఫలితంగా పంటలు ఎండిపోయాయి. పేదింటి ఆడపిల్లల పెండ్లికి కళ్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు. కానీ, దాని ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతిపై మాట మార్చేశారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రయత్నించలేదు. బీఆర్ఎస్ హయాంలో నియామక పరీక్షలు, ఎంపికలు పూర్తయిన వారికి మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం నియామకపత్రాలు ఇచ్చింది. వాటిని ఇప్పుడు తమ ఖాతాలో వేసుకుంది తప్ప కొత్తగా ఒక్క ఉద్యోగ నియామకాన్ని చేపట్టలేదు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి సైతం నిజం చెప్పకుండా తామే నియామకాలు చేశామని చెప్పించడం సహేతుకమే కాదు.

అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్.. వాటిలో ఒక్క మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప ఏ గ్యారెంటీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది. రైతు రుణమాఫీ చేయనేలేదు. రైతుబంధు స్థానంలో తెస్తామన్న రైతు భరోసా ఊసేలేదు. రైతుబంధు కింద పెట్టుబడి సాయం కూడా మూడెకరాల వరకే అందించినట్టు తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ పథకానికి రూ.10 లక్షల చికిత్స పరిమితిని బీఆర్ఎస్ ప్రభుత్వమే వారి హయాంలో పెంచినందున అది కాంగ్రెస్‌కు అంతగా లాభించలేదు.

ప్రతీకారేచ్ఛతో...

అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై కంటే అధికంగా ప్రతీకారేచ్ఛపైనే దృష్టి సారించినట్టు కనిపిస్తున్నది. ఐదేండ్లు పాలించే అవకాశం ఉన్నా.. విపక్ష బీఆర్ఎస్ నుంచి ముప్పు ఉందనే ప్రచారం చేసి, ఆ పార్టీని దెబ్బతీయడానికి కాంగ్రెస్ పూనుకుంది. పాలనాంశాలను రాజకీయాలకు ముడిపెట్టింది. సాగునీటి ప్రాజెక్టుల గేట్లు మూసేసి గాంధీభవన్ గేట్లు తెరిచి బీఆర్ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకుంది. బీఆర్ఎస్ గెలిచిన జడ్పీలు, కార్పొరేషన్లు, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీలు చివరికి ప్రాథమిక సహకార సంఘాల్లోని సభ్యులను పార్టీలోకి చేర్చుకొని ఆయా స్థానాలను దొడ్డిదారిన కైవసం చేసుకుంటోంది. గత ప్రభుత్వ హయాంలోని పథకాలు, కార్యక్రమాలు, ఉత్తర్వులు, నిర్ణయాలు ఇలా అన్నింటిపైనా విచారణలకు ఆదేశించింది. విచారణ ప్రారంభం కాకముందే వాటిపై లీకులు ఇచ్చి అవే నిజాలని ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు సమీక్ష సమావేశాల కంటే విపక్షాన్ని విమర్శించడంపైనే ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తున్నారు.

వ్యూహం ఫలిస్తుందా?

గతేడాది నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 64 స్థానాలను గెలిచిన కాంగ్రెస్ లోక్‌సభలో మెజారిటీ స్థానాలు వస్తాయనే అతి నమ్మకంతో ఉన్నది. తాము ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని ప్రజలు నమ్ముతారనే భావన ప్రభుత్వంలో కనిపిస్తోంది. అయితే 2018 శాసనసభ ఎన్నికల్లో 88 స్థానాలు గెలిచిన బీఆర్ఎస్ ఆ వెంటనే 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 9 స్థానాలే గెలిచిందనే విషయాన్ని మరిచిపోవద్దు. ప్రజలు విజ్ఞులు. వారు ఏది మంచి, ఏది చెడో తెలుసుకొని విలక్షణ తీర్పు ఇస్తారని పాలకులు గుర్తించాలి.

సమీక్షించుకోవాలి...

బీఆర్ఎస్ ప్రభుత్వం తమ పదేండ్ల పాలనలో ఎంతో అభివృద్ధి చేసినా.. ప్రజలు మార్పును ఆశించి కాంగ్రెస్‌కు పట్టం గట్టారు. బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయింది? తాము ఎందుకు గెలిచాం? తామేం చేయాలి? అంటూ నాలుగు నెలల పాలనను సమీక్షించుకునే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదు. తమను తాము ప్రశంసించుకుంటే, అందరూ అదే నమ్ముతారనే భావన సరికాదు. విపక్షంపై పగ, ప్రతీకారాల మీద దృష్టి పెట్టకుండా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. పాలకుల ఆలోచన విధానాలు రాష్ట్రానికి మేలు చేస్తేనే ఓటర్లు ఆదరిస్తారు. ఐదేండ్ల తర్వాతే ప్రజలు మారుతారని అనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. తమకు సరైన పాలన అందడం లేదని భావిస్తే నెలల్లోనే వారి తీర్పు మారుతుందని పాలకులు గుర్తించి, అందుకు తగ్గట్టుగా నడుచుకోవాలి.

తేలాల్సిందల్లా!

మండే సూర్యుడిపై మబ్బుల
దుప్పటి కప్పి
మేఘాలన్నీ గర్జిస్తున్నాయి
గాలి దుమారం కాస్త జనజీవన
స్రవంతిని
అతలాకుతలం చేసే పనిలో
నిమగ్నమైంది
గోదాముల్లో ఉండాల్సిన వడ్లిప్పుడు
తారు రోడ్డుపై తలలార
బెట్టుకుంటున్నాయి

ఇప్పుడిక్కడ ఎవరూ సుఖంగా లేరు
అందరూ దుఃఖ నదిలో
కొట్టుకుపోతున్నవాళ్లే
ఏ మేఘం వచ్చి
వడగళ్లను విసురుతుందో
ఏ తుపాను వచ్చి
పంటలన్నీ ఊడ్చి వెళుతుందో
ఏ ఈదురుగాలి
గుడిసెలతో పాటు ప్రాణాలనెగరేసుకు
పోతుందో
ఎవరికీ అంతుపట్టకుండా ఉన్నది

నష్టపరిహారం నష్టాన్ని
పూరించలేకపోతోంది
ఓదార్పుయాత్రలు
కన్నీళ్లకేమీ అడ్డుకట్టలేయలేక
పోతున్నాయి
వాగ్దానాలన్నీ వలస పక్షుల్లా
ఎగిరిపోతున్నాయి
చేసిన అప్పులు
ఉరితాళ్లయి మెడకు
చుట్టుకుంటున్నాయి

ఎవరు చేస్తేనేం? గాయం గాయమే
గాయం చిన్నదైతేనేం, పెద్దదైతేనేం
విరిగిన మనసు అతుక్కుంటుందా?
పోయిన ప్రాణాన్ని తిరిగి
నిలబెడుతుందా?

పూడ్చుకోలేని నష్టమైతే జరిగింది
తీర్చుకోలేని బాధలైతే పెరిగాయి
అకాల వర్షాలు, వడగళ్ల వానలు
పిలువని అతిథులేం కాదు
తేలాల్సిందల్లా వాళ్లను
పిలిచిందెవరని?

ఎన్ నరేశ్ చారి
97013 34516

మోదీ మాటలకు గ్యారెంటీ ఏది?

డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్
98493 28496

> పదేండ్ల మోదీ సర్కార్ పాలనను చూస్తే.. దయనీయమైన మన దేశ ప్రస్థానం కండ్ల ముందే సాక్షాత్కరిస్తుంది. 'సబ్ కా సాథ్- సబ్ కా వికాస్', 'అమృతకాలం' వంటి మోదీ గ్యారెంటీల బూటకపు నినాదాల వాస్తవాలు మనకు కనిపిస్తాయి. మోదీ పాలనలో భారతీయ ప్రజల జీవన ప్రమాణాలు, సామాజిక భద్రత, ఉపాధి, వేతనాలు, ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. బీజేపీ సర్కార్ అవలంబించిన నయా ఉదారవాద విధానాలు దేశాన్ని తీవ్రమైన సామాజిక, ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేశాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో దేశంలో నిరుద్యోగిత రేటు పెరిగింది. అన్నమో రామచంద్రా అంటూ అలమటించే సంఖ్య విపరీతంగా పెరిగింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం.. ఆకలి సూచీలో 125 దేశాల్లో మన దేశం 111వ స్థానంలో నిలవడమే అందుకు నిదర్శనం. అయితే దేశంలో ఉన్న అనేక ప్రధాన సమస్యలు చర్చకు రాకుండా ప్రజలను మతం మత్తులో ముంచుతున్నది బీజేపీ. రాష్ట్రాల హక్కులను హరించివేస్తున్నది. సమాఖ్యవాదానికి తిలోదకాలు ఇచ్చింది. ఏకస్వామ్య విధానానికి బాటలు వేస్తున్నది. వ్యవస్థలను మారుస్తూ నియంతృత్వ పోకడలను కొనసాగిస్తున్నది. కుల నిర్మూలన అనే రాజ్యాంగ లక్ష్యానికి బదులు అసమానతల కుల వ్యవస్థ స్థిరీకరణకు పూనుకుంటున్నది.

పదేండ్ల మోదీ పాలనలో దేశంలో పేదరికం మరింతగా పెరిగింది. సంపన్నుల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. మోదీ మిత్రులు అంబానీ, అదానీ ప్రపంచ కుబేరులుగా మారిపోయారు. 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ.. కార్పొరేట్ సంస్థల ఎదుగుదలకు తోడ్పడ్డారు. ప్రతిఫలంగా మోదీ రుణం తీర్చుకోవడానికి గుజరాతీ కార్పొరేట్ సంస్థలు ఆయనను ప్రధానిని చేయటంలో సహకరించాయి. అందుకే ప్రజల సొమ్ముతో నిర్మించిన అనేక ప్రభుత్వ రంగ సంస్థలను

ఒక్క కలం పోటుతో ప్రైవేట్ కంపెనీలకు బీజేపీ సర్కార్ అప్పగించేసింది.

బ్యాంకులను ముంచి విదేశాలకు పారిపోయిన వారిలో అత్యధికులు గుజరాతీ వ్యాపారులే. వారు దోచుకున్నదంతా ప్రజాధనమే. బ్యాంకు రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయినవారిని ఎక్కడున్నా పట్టుకొస్తామని ప్రగల్భాలు పలికిన మోదీ ఈ పదేండ్లలో ఏం సాధించారో అందరికీ తెలుసు. పైగా బ్యాంకులపై ఒత్తిడి తీసుకొచ్చి వారి రుణాలను మాఫీ చేశారు. గత పదేండ్లలో మోదీ ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలు చెల్లించాల్సిన రూ.15 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇదంతా ప్రజల సొమ్ము కాదా?

అంతే కాదు, గత పదేండ్లలో కార్పొరేట్ సంస్థలకు రూ.55 లక్షల కోట్ల పన్ను రాయితీలను కూడా ప్రభుత్వం ఇచ్చింది. తాజా బడ్జెట్‌లో కార్పొరేట్ కంపెనీలపై పన్నును 33 శాతం నుంచి 25 శాతానికి తగ్గించింది. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఇలాంటి ఆర్థిక విధానాలను సమర్థించే కొందరు కుహనా మేధావులు.. సంక్షేమ కార్యక్రమాలను తప్పుబడుతుండటం విడ్డూరం.దేశంలో ద్రవ్యోల్బణాన్ని అరికడతామని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని 2014లో మోదీ హామీ ఇచ్చారు. కానీ, మోదీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉదాహరణకు గ్యాస్ సిలిండర్ ధర 2014లో రూ.410 ఉండగా.. ప్రస్తుతం రూ.906 చేరింది. నిజానికి సిలిండర్ ధరలు రూ.1200ను తాకాయి. ఎన్నికల సమయం కావడంతో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఎన్నికల తర్వాత వడ్డీతో సహా మరోసారి ధరాఘాతం తప్పదు.

> ప్రధాని నోటి నుంచి వెలువడే ప్రతి మాట విలువైనది. కానీ, మన ప్రధాని గత పదేండ్లలో మాట్లాడినన్ని అబద్ధాలు మరో దేశాధినేత మాట్లాడి ఉండరు. తాజాగా రాజస్థాన్‌లో ఎన్నికల ర్యాలీలో.. 'కాంగ్రెస్ గెలిస్తే మీ సంపదను ముస్లింలకు పంచేస్తుంది. తల్లుల మెడలోని మంగళసూత్రాలను వదలదు' అంటూ ఒక మతాన్ని టార్గెట్ చేసి మాట్లాడారు. ప్రధాని స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడటం తగునా?

మనం వేసే ఓటే మన దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఓటర్లు ఒక్కసారి ఆలోచించాలి. కులం, మతం, జాతి అనే అభిమాన, దురాభిమానాలకు, తాత్కాలిక రాయితీలు, ప్రలోభాలకు లొంగిపోవద్దు. ఓట్ల కోసం చెప్పే మాటలు, వాగ్దానాల ఒరవడిలో కొట్టుకుపోవద్దు. నాయకులు, పార్టీల గత చరిత్ర, హామీల అమలును తెలుసుకొని ఓటు వేయండి. ఓటు మన హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా.



> **నిస్పృహలతోనే మోదీ వ్యాఖ్యలు**
>
> *తొలి విడత పోలింగ్‌లో బీజేపీ అనుకున్న దాని కంటే చాలా తక్కువగా పనితీరును కనబరిచిందనడానికి ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. మోదీ చేస్తున్న ప్రకటనలే ఆయనలో నెలకొన్న నిరాశ, నిస్పృహలకు తార్కాణం. ఆయన వ్యాఖ్యలు యావత్ ప్రపంచాన్ని తలదించుకునేలా చేశాయి.*
>
> **- ప్రకాశ్‌రాజ్**, సినీ నటుడు

> తెలంగాణ తెచ్చిన పార్టీగా బీఆర్ఎస్‌కు పూర్తి మార్కులు పడితే, ఇచ్చిన పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్‌కు పడేది సున్నా మార్కులే! తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ తమదేనని, ఇది సోనియమ్మ ప్రసాదించిన వరమని తెలంగాణ నేతలు పదేపదే వేదికలపై ప్రకటిస్తుంటే నవ్వే కాదు, ఏడుపు కూడా వస్తున్నది. ఆ మాట చెప్పుకొనే అర్హత కాంగ్రెస్‌కు ఏమాత్రం లేదు. అదే నిజమైతే తెలంగాణ ప్రజలు 2014లో ఆ పార్టీకే పట్టం కట్టేవారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలో 49 చోట్ల గెలిచిన కాంగ్రెస్.. స్వరాష్ట్రం సిద్ధించాక 2014లో జరిగిన ఎన్నికల్లో 21 స్థానాలకు పరిమితమయ్యేది కాదు.

కాంగ్రెస్ ఇచ్చింది కాదు, తెచ్చింది కాదు

బి.నర్సన్
94401 28169

టీడీపీని ఓడించేందుకు వైఎస్ఆర్ ప్రణాళికల్లో భాగంగా 2004లోనే తెలంగాణ ప్రజలతో కాంగ్రెస్ ఆటాడుకున్నది. ఆనాటి టీఆర్ఎస్‌తో జతకడితే తప్ప తెలంగాణలో చంద్రబాబును కట్టడి చేయలేమని స్వరాష్ట్రాన్ని ఆశ చూపి పొత్తుకూడింది. ఆ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్‌కు 48, టీఆర్ఎస్‌కు 26 సీట్లు రాగా.. టీడీపీకి 11 స్థానాలే దక్కాయి. 1999 ఎన్నికల్లో అదే టీడీపీ తెలంగాణ ప్రాంతంలో 50 స్థానాల్లో గెలుపొందింది. ఈ రకంగా ఆనాటి టీఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పాలనకు మూలకారణమైంది. తెలంగాణ ఏర్పాటుకు చంద్రబాబు బద్ధ వ్యతిరేకి కావడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వస్తే అయినా అసెంబ్లీలో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టవచ్చని, పార్లమెంట్‌లో అనుకూలంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందనే భరోసాతో తెలంగాణ ప్రజలు 2004లో కాంగ్రెస్‌ను గెలిపించారు. చివరకు పాలు పోసిన చేతినే కాటేసినట్లు నమ్మి ఓటేసిన తెలంగాణ ప్రజల ఆకాంక్షలపై వైఎస్ఆర్ నీళ్లు చల్లారు. తెలంగాణ ప్రజల కలను నెరవేర్చకుండా, కాంగ్రెస్‌కు సహకరించిన టీఆర్ఎస్ ఉనికే లేకుండా చేసే కుట్రలకు తెరలేపారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌తో విసిగి వేసారిన టీఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వానికి తన మద్దతును ఉపసంహరించుకుంది.

ఆనాటి నుంచే వైఎస్ఆర్‌కు తెలంగాణ పట్ల చులకనభావం ఏర్పడింది. తెలంగాణ ఏర్పాటు అంశం అనగానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అంగీకారం కావాలని, ఎన్నో అంశాలపై చర్చలు జరగాలని, రెండు రాష్ట్రాలా? మూడు రాష్ట్రాలా? అనేది తేలాలని.. ఇలా రకరకాల అడ్డంకులు సృష్టించి ఐదేండ్ల పాటు కాలయాపన చేశారు. అలా తాత్సారం చేసిన కాంగ్రెస్ సీఎం 2009 ఫిబ్రవరిలో కొత్త రాగం అందుకున్నారు. తెలంగాణ డిమాండ్ ఎప్పుడూ తన హృదయానికి దగ్గరగా ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, ఉభయసభల్లో నుంచి అన్ని పార్టీల భాగస్వామ్యంతో ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేస్తుందని, ఆ నివేదిక రాగానే తగిన నిర్ణయాలు తీసుకుంటుందని వైఎస్ఆర్ నమ్మబలికారు. అలా కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిన టీఆర్ఎస్ తెలంగాణ ఏర్పాటే ఏకైక లక్ష్యంగా 2009 ఎన్నికల్లో టీడీపీ, కమ్యూనిస్టు పార్టీలతో కలిసి మహాకూటమిగా ఏర్పడింది. అప్పుడు తొలి దశలో భాగంగా తెలంగాణ ప్రాంతంలో పోలింగ్ పూర్తయిన వెంటనే ఆంధ్రా ప్రాంతంలో ప్రచారానికి వెళ్లిన రాజశేఖర్‌రెడ్డి.. అక్కడ తెలంగాణపై తన కడుపులో ఉన్న విషాన్ని కక్కారు. 'తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా చేస్తే కోస్తా, రాయలసీమ నుంచి వెళ్లి హైదరాబాద్‌లో స్థిరపడ్డవారు విదేశీయులైతారు. అక్కడికి వెళ్లడానికి వారికి పాస్‌పోర్ట్ అవసరమవుతుంది' అని నంద్యాలలో

జరిగిన ప్రచార సభలో కాంగ్రెస్ నిజస్వరూపాన్ని మరోసారి బయట పెట్టారు. తెలంగాణ ఏర్పాటుకు సహకరిస్తామని మాట్లాడిన నోటితోనే మరుక్షణమే నాలుక మడిచి ఆంధ్రాలో వారికి అనుకూలంగా, తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారు.

ఆయన వ్యాఖ్యలను కేసీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఒకే రాష్ట్రంలోని రెండు ప్రాంతాల ప్రజల మధ్య వైషమ్యాలను ప్రేరేపిస్తున్నారని ఈ విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. 'దమ్ముంటే ఆ మాట తెలంగాణలో ఓట్లు పడకముందే మాట్లాడి ఉండాల్సింది. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి ఇలా ఒక ప్రాంత ప్రజలను నమ్మించి గొంతు కోయడం ఘోరమైన అన్యాయం' అని నిలదీశారు.

2009లోనూ కాంగ్రెస్ గెలవడం, వైఎస్ఆర్ మరోసారి సీఎం కావడంతో తెలంగాణకు మళ్లీ కష్టకాలం మొదలైంది. ఆ సమయంలో అసెంబ్లీ సమావేశాల్లో రాజశేఖర్‌రెడ్డి టీఆర్ఎస్ సభ్యుల గురించి నోటికొచ్చినట్టు మాట్లాడారు. తెలంగాణ డిమాండ్‌ను ఎద్దేవా చేశారు. ఊహించని రీతిలో 2009 సెప్టెంబర్‌లో వైఎస్ఆర్ దుర్మరణం పాలైన విషయం అందరికీ తెలిసిందే. ఆ తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం ఇద్దరు ముఖ్యమంత్రులను మార్చింది. వారు ఆంధ్రా ప్రాంతం వారే కావడం, తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకులు కావడంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. నిరాశతో యువత ఆత్మబలిదానాలు చేసుకోవడం నిత్యకృత్యంగా మారిపోయింది. తెలంగాణ అట్టుడుకుతున్న సమయంలో ఆంధ్రా నాయకులు ఢిల్లీ వెళ్లి తెలంగాణ ఇవ్వవద్దని సోనియాగాంధీతో కచ్చితంగా చెప్పారు. అయితే వివిధ ఐకాసల నేతృత్వంలో ఉద్యమం వెయ్యి రెక్కలు విప్పుకోవడంతో తెలంగాణ ప్రజల చిరకాల వాంఛకు కాంగ్రెస్ తలొగ్గక తప్పలేదు. చివరకు అది కూడా 2014 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును ఆమోదింపజేశారు. అలా 2014 జూన్ 2న తెలంగాణ ప్రజల కల సాకారమైంది.

> **ఇదంతా చూశాక కాంగ్రెస్ పార్టీ దశాబ్దం పాటు తెలంగాణ ప్రజలను రాచి రంపాన పెట్టిందా? లేదా నోరి డిచి అడగంగానే 'పట్టండి' అని రాష్ట్రాన్ని చేతిలో పెట్టిందా? అనేది స్పష్టమవుతున్నది. సోనియాను తెలంగాణ ఇచ్చిన మహాతల్లి అని కాంగ్రెస్ నేతలు సభాముఖంగా అనడం చరిత్ర తెలిసి కూడా బుకాయించడమే అవుతుంది.**

బ్రిటిష్ వాడితో వందేండ్లకు పైగా పోరాడి, ప్రాణత్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకున్నట్టే.. అంతకంటే కష్టనష్టాలకు ఓర్చి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీతో పద్నాలుగేండ్లు యుద్ధం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నారు. 2004లోనే హామీ ఇచ్చినట్టు త